కథా నిలయం
శ్రీకాకుళం

# గెలుపు...

-కోపూరి పుష్పాదేవి

అది అందాల కాశ్మీరం. శ్రీనగర్ - లే జాతీయ రహదారి. టైగర్‌హిల్ ప్రాంతం. దురాశతో మన భూభాగాలు ఆక్రమించుకోవడానికి, పాకిస్థాన్ ముష్కరులు ఆ పర్వతాల్లో మాటువేసి ఉన్నారు.

వారిని తుదముట్టించడానికి అర్ధరాత్రి కారు చీకటిలో రక్తం గడ్డకట్టే చలిలో మన సైనికులు బయలుదేరారు. పోరు తీవ్రంగా సాగుతోంది.

భారతదేశంలోని వంద కోట్లకు మించిన ప్రజలు స్వేచ్ఛగా, స్వాతంత్ర్యంతో జీవిస్తూ, రాత్రుళ్ళు ఆదమరచి హాయిగా నిద్రపోగలుగుతున్నారంటే... అది ఆ వీర సైనికుల త్యాగఫలమే.

వారు అన్ని సుఖాలకు దూరంగా, అనేక కష్టనష్టాల కోర్చి, వారి విధి వారు సక్రమంగా నిర్వహించడం వల్లనే మనమందరమూ సుఖశాంతులతో జీవించగల్గుతున్నాం. వారి జీవనాధారం కోసమే వారా పని చేస్తున్నారని కొందరు అనుకోవచ్చు. కానీ, కేవలం జీతం డబ్బుల కోసమే అయితే ప్రాణాలొడ్డి, భార్యా బిడ్డలకు వేల మైళ్ళ దూరంలో అన్ని కష్టాలూ పడి, ఆ ఉద్యోగాలే చెయ్యనక్కరలేదు గదా...? కడుపులో చల్ల కదల కుండా ఏసీ రూముల్లో కూర్చుని చేసే ఇంకా చాలా రకాల ఉద్యోగాలు ఉన్నాయి. కానీ దేశభక్తి అణువణువునా నిండి ఉన్న వాళ్ళే మిలటరీలోకి వెళతారు. మాతృదేశ ఋణం తీర్చుకోగలుగుతారు.

మన సైన్యంలో కెప్టెన్ సుదర్శన్, కెప్టెన్ గోపాల్‌లు కూడా ఆనాడు జరుగుతున్న పోరులో ఉన్నారు. వీరోచితంగా పోరాడి నలుగురు శత్రువులను తుదముట్టించాడు గోపాల్. అంతలో ఒక పాకిస్థాన్ తీవ్రవాది పేల్చిన తూటా సూటిగా వచ్చి గోపాల్ గుండెల్లో దిగబడింది. పక్కనే ఉన్న సుదర్శన్ చేతిని గట్టిగా పట్టుకుని 'జై భారత్' అంటూ చివరి శ్వాస వదిలాడు గోపాల్. అతని శరీరం నేలవాలకుండా, ప్రాణమిత్రుణ్ణి ఆప్యాయంగా ఒళ్ళోకి తీసుకున్నాడు సుదర్శన్.

❍ ❍ ❍

గోపాల్‌కూ, సుదర్శన్‌కూ మిలటరీలో చేరినప్పుడు స్నేహం కలిసింది. అప్పటినుంచీ ఇద్దరూ పాలూ, నీరులా కలిసిపోయారు. సుదర్శన్ సంపన్న వర్గం నుంచి వచ్చాడు. బ్రహ్మచారి. అతనికి తల్లీ, తండ్రీ, బంధువర్గమూ అందరూ ఉన్నారు.

గోపాల్‌ది పేద కుటుంబం. తండ్రి లేడు. తల్లి వృద్ధురాలు. గోపాల్‌కు మూడు సంవత్సరాల కొడుకు ఉన్నాడు. అతని భార్య ఏడాది క్రితం కేన్సరుతో మరణించింది.

❍ ❍ ❍

"మన ప్రాణాలు గాలిలో దీపాలు కదా... ఏ క్షణాన ఏమి జరిగినా..., నా బిడ్డ బాధ్యత నువ్వే తీసుకోవాలి..." అని అంటూ ఉండేవాడు గోపాల్ నాతో. అదే నిజమయింది. నీవు కూడా నాతో వచ్చెయమ్మా... నా తల్లిలా చూసుకుంటాను" అన్నాడు సుదర్శన్ గోపాల్ వాళ్ళ అమ్మతో.

దుఃఖంతో ఆమె వణికిపోతోంది. అయినా, తన బిడ్డను దేశమాతకు అర్పించానన్న తృప్తి ఆమె కన్నుల్లో మెరుస్తోంది.

"నువ్వు అంత మాట అన్నావు... చాలు బాబూ, పసివాడి బాధ్యత తీసుకుంటానన్నావు... అదే కొండంత మేలు నాకు. తల్లీ తండ్రీ లేని అనాథ. వాడు ఏమైపోతాడోనని బెంగగా ఉండేది. ఆ దిగులు నాకు తొలగించావు. ఉత్తముడవైన నీ పెంపకంలో వాడు సత్ప్రవర్తనుడుగా పెరుగుతాడని నాకు నమ్మకం ఉంది. వాణ్ణి కూడా వీరజవానుని చేసి, చిరకాలం దేశసేవ చెయ్యాలన్న వాళ్ళ నాన్న తీరని కోరిక వాడి ద్వారా నెరవేర్చు. నేనా... ముసలిదాన్ని, ఇంకా ఎన్నాళ్ళు ఉంటానో తెలియదు. చివరి రోజులు నేను పుట్టిన గడ్డమీదనే వెళ్ళదీసుకుంటాను. నీవు సద్బుద్ధి గల వాడివి. భార్యాబిడ్డలతో కలకాలం చల్లగా ఉండు తండ్రీ..." అంటూ ఆ వృద్ధురాలు సుదర్శన్‌ను మనసారా ఆశీర్వదించి మనవడు శివాజీని నమ్మకంతో అతనికి అప్పచెప్పింది.

❍ ❍ ❍

యుద్ధం ముగిసింది. భారత సైన్యం పాకిస్తాను సైనికుల్ని విజయవంతంగా వెళ్ళగొట్టింది. సుదర్శన్ దీర్ఘకాల సెలవుతో ఇంటికి వచ్చాడు. "ఏవేవో కారణాలు చెప్పి ఇంతకాలం పెళ్ళి వాయిదా వేశావు.

ఇకనైనా అభ్యంతరం చెప్పకు. మేము మాకు నచ్చిన నాలుగయిదు సంబంధాలు చూసి సిద్ధంగా పెట్టాము. నువ్వు ఆ అమ్మాయిలను చూసి నీకు నచ్చిన అమ్మాయిని ఓకే చెయ్యి. మళ్ళీ నీ సెలవులు అయిపోయేలోగా పెళ్ళి జరిగిపోవాలి" అంటూ తల్లీ, తండ్రీ బలవంత పెట్టారు సుదర్శన్‌ను. ఇక తప్పదనుకుని అందరు అమ్మాయిలనూ చూసి చివరకు కుసుమను ఎన్నుకున్నాడు సుదర్శన్. కానీ, ఆమెతో ఏకాంతంగా మాట్లాడాలని షరతు పెట్టాడు.

కుసుమతో ఉన్న విషయమంతా వివరంగా చెప్పాడు సుదర్శన్. "శివాజీ బాధ్యత నా మీద ఉంది. వాడు నా కొడుకు వంటివాడు. నీవూ వాణ్ణి కొడుకులా చూసుకోగలననుకుంటే..., ఇక మన పెళ్ళికి నాకెటువంటి అభ్యంతరమూ లేదు" అన్నాడు.

కుసుమ చాలా తెలివిగలది. బాగా ఆలోచించింది. సుదర్శన్ ధనవంతుడు. మంచి చదువూ, గొప్ప ఉద్యోగం ఉన్నవాడు. తల్లిదండ్రులకు ఏకైక కుమారుడు. ఇన్ని అర్హతలున్నవాణ్ణి శివాజీ కారణంగా వదులుకోవలసిన అవసరం లేదు. పెళ్ళై, భర్త తన చెప్పుచేతల్లోకి వచ్చిన తర్వాత వాడి సంగతి ఆలోచించవచ్చు" అనుకుని "మీ ఇష్టమే నా ఇష్టం" అంటూ అంగీకారం తెలిపింది.

❍ ❍ ❍

కొత్త కాపురం ముచ్చటగా సాగుతోంది. కానీ, కుసుమకు శివాజీ కంటిలో నలక లాగా, చెప్పులోని రాయిలాగా అనిపించసాగాడు. తల్లి అందచందాలూ, తండ్రి పర్సనాలిటీ పుణికి పుచ్చుకున్న శివాజీ చాలా అందంగా, ముద్దుగా ఉంటాడు. చక్కని నవ్వు, చిలిపి అల్లరి వాడి సొంతం. సుదర్శన్ తల్లిదండ్రులు కూడా వాడు తమ సొంత మనవడు అన్నట్లు ముద్దుచెయ్యడం కుసుమకు మరీ కంటగింపుగా ఉంది. కానీ, వాణ్ణి ఎలా బయటకు పంపాలో ఆమెకు అర్థం కావటంలేదు. సుదర్శన్ చాలా మంచివాడు. కానీ చండశాసనుడు. అతనికి నచ్చనిది ఏమి జరిగినా సహించడు. అతనికి భార్య స్వభావం ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది. కానీ, ఇప్పుడేం చెయ్యగలడు?

సుదర్శన్ తిరిగి డ్యూటీలో చేరవలసిన సమయం వచ్చింది. అందరికీ బాధగా ఉన్నా తప్పదు కదా... అప్పుడే అతని తల్లికి ఆరోగ్యం కొద్దిగా కుంటుపడింది. ఇదే అదనుగా శివాజీని కొంతకాలమైనా దూరం చెయ్యాలని భావించిన కుసుమ వాణ్ణి రెసిడెన్షియల్ స్కూలుకు పంపమని సుదర్శన్‌పై ఒత్తిడి తెచ్చింది. కుసుమ దగ్గర కంటే అక్కడే నయమని భావించిన సుదర్శన్ వాణ్ణి మంచి పేరున్న కాన్వెంట్లో చేర్చాడు.

❍ ❍ ❍

పది సంవత్సరాలు గడిచిపోయాయి. సుదర్శన్‌కు కూడా ఇద్దరు పిల్లలు. అబ్బాయి ప్రమోద్. అమ్మాయి వినీత. ఎనిమిది, ఆరు సంవత్సరాలు. అచ్చం తల్లి బుద్ధులే. అల్లరీ ఆగం ఎక్కువ.

శివాజీ చదువులోనూ, నడవడికలోనూ స్కూల్లో మంచి పేరు తెచ్చుకున్నాడు. టీచర్లక్కూడా అతడంటే వల్లమాలిన అభిమానం. ప్రమోద్ వినీతలు మాత్రం

## హృదయ కమలం

**త**నువంతా
విరబూసిన రోదనలో
విరి ఊయలలూగదు మనసు
అందమైన అబద్ధం కాదు జీవితం
ఆశ, నిరాశల అంతర్లీన ప్రవాహం
ఉదయస్వామి లేత కిరణాలు సోకనిదే
హృది కమలిని ముకుళించదు
పంకిలంలోనే విరబూసే కమలిని
నెలవు వీడిన మోడై మిగులును
ఎడారి దారుల్లో ఎద కోయిల
పాడమంటే పాడదు పరవశాన
శిరసొంచి సాగిపోనిదే శిశిరం
ఎలకోయిల స్వరపేటిక సవరించేనా?
మధురిమల సరిగమలు ఆలపించేనా?
అనంతమైన ఆత్మ విశ్వాసమే తన అందమంటూ
శిథిల హృదయ రాగాన్ని శృతిచేసి
శివరంజనిలో ఆలపిస్తూ
పరవశించిపోతుంది ప్రకృతి!
మాయని మమతల వలపు గంధమే
హృది పరిమళమంటూ
విరబూయించిన ఉదయ స్వామిని కీర్తిస్తూ
కళ్యాణ వసంతం రవళిస్తుంది
ఇల కోయిల గానలహరిలో!
మౌనంగానే మురిసిపోతుంది
ప్రకృతి హృదయ కమలంలో!

-మధూలిక

## కాలం మీద నెపం

మరోసారి ఏడు మారిందనగానే
నెపం కాలంమీద నెట్టేయవచ్చంటావు
పాతరోజులే బాగున్నాయన్న నాస్టాల్జియా
బలంగా ఆవరించినప్పుడు- / భవిష్యత్తు మీద ఆశల
ఆకాంక్ష / మరీ బిగుసుకుంటుంది.
వర్తమానంలో వేసే ప్రతి అడుగూ
అభివృద్ధి కాంక్షను/అహరహం పెంచుతూ వుంటుంది.
పోయిందేముంది! / అనుకున్నదేదో / అనుకున్నట్లుగా
జరగడంలేదనే / ఒక అనూహ్య తపన-
మనసును పరిదగ్ధం చేస్తూంటుంది.
ఎవరో ఎక్కడో ఎదుగుదలను
రాకుండా ఎదుర్కొంటున్నారన్న ఊహ-
ఆర్తిగీతాన్ని ఆలపించజూస్తుంది.
అన్నింటికీ హేతువు చివరికి
కలసిరానికాలమే అనిపిస్తూంటుంది.
మరోసారి మరోసారి నెపం
కాలం మీద నెట్టివేస్తూనే ఉంటావు.
చట్టం తన పని తాను చేసుకుపోయినట్లు
కాలం- / తన పని తాను చేసుకుపోతుందంటావు.
ఇంతకీ- / కాలానికి గులాం అయ్యి
సలాంచేసినంత మాత్రాన
కనికరించి కోరికలీడేరుస్తుందనుకోకు!
కాలం నిన్ను జయించే ముందే-
కాలాన్ని నువ్వెందుకు జయించవు?
కాలం పగ్గాలు / నీ చేతుల్లోకి తీసుకోవడమంటే-
నీ కాలాన్ని నువ్వు నియంత్రించి,
సద్వినియోగం చేసుకోవడమే.
సమయం చాలనట్లే ఉంటుంది.
సమయం స్తంభించినట్లే ఉంటుంది.
సమయం ఆసన్నమైనట్లే ఉంటుంది.
సమయపాలన నీ చేతుల్లో పనే. / నీ సామర్థ్యమే.
అందుకే- / నెపం నీమీదే వేసుకో.
నిన్ను నీవే చెక్ చేసుకో.
ఎవరిని నిందించీ ప్రయోజనం లేదు-/ నీతో సహా!
గడియారం- / నీ చేతికో, టేబుల్ మీదో, / గది
గోడకో కాదు ఉండవలసింది;/ నీ గుండెల్లో ఉండాలి.
ఆచరణల ముళ్లే/కాలాన్ని ముందుకు తీసుకువెళ్ళాలి.

గంటలు కొట్టినా, అలారం మ్రోగినా
కాలాన్ని సెట్ చేసేది నువ్వే.
కాలం పరిమళించడానికి
వికసించే పువ్వు నువ్వే. / ఇప్పుడు కాదు ఎప్పుడూ
నెపం కాలం మీద నెట్టకు. / భవితవ్యాన్ని తప్ప
గతాన్ని దోసిటపట్టకు.

**-సుధామ**

శివాజీ అంటే ఈర్ష్య, అసూయలతో కుత కుత ఉడికి పోతుంటారు. అతనిమీద అకారణంగా ద్వేషం పెంచు కున్నారు. వాళ్ళు చేసిన తప్పులు తనమీద వేసుకుని శివాజీ సుదర్శన్ దెబ్బల నుంచి వాళ్ళను కాపాడినా, వాళ్ళెందుకో అతణ్ణి తమలో కలుపుకోలేక పోతున్నారు.

ఒకరోజు గార్డెన్‌లో దొంగచాటుగా సిగరెట్ కాలుస్తున్నాడు ప్రమోద్. వినీత కూడా అక్కడే ఉంది. అది చూసిన శివాజీ ప్రమోద్ చేతిలో నుంచి సిగరెట్ లాక్కుని "మీ నాన్నకు చెబుతానుండు" అంటున్నాడు. అంతలో సుదర్శన్ అక్కడికి రానే వచ్చాడు. "శివాజీ సిగరెట్ కాలుస్తున్నాడు" తండ్రితో చెప్పారు ప్రమోద్, వినీతలు.

"ఏరా... నిజమేనా?" గద్దించాడు సుదర్శన్.

శివాజీ మాట్లాడకుండా తల వంచుకున్నాడు. "మరోసారి ఇలాటివి చూస్తే చీరేస్తాను ముగ్గురినీ" అరిచి వెళ్ళిపోయాడు సుదర్శన్.

అతను దూరంగా వెళ్ళిపోయాక, "బాగా కుదిరిందా తిక్క... నేను సిగరెట్ కాలిస్తే నీకేమయిందటా... పెద్ద వీరుడిలాగా వచ్చి నాన్నకు చెబుతానని బెదిరించావు. నాన్న నిన్నే తిట్టారు" పెద్దగా నవ్వుతున్న ప్రమోద్‌ని చెట్టుచాటు నుంచి వచ్చిన సుదర్శన్ చెవి పట్టుకున్నాడు.

"ఏరా వెధవా... సిగరెట్ తాగింది కాక, ఇంకా అబద్ధాలు కూడానా..." అంటూ బెల్ట్ తీసి నాలుగు వాయించాడు. వినీత భయపడి లోపలికి పారిపోయింది. శివాజీ అడ్డుపడి తనూ రెండు దెబ్బలు తిన్నాడు. అంతలో కుసుమ పరిగెత్తుకు వచ్చింది "బిడ్డను చంపేస్తారా ఏమిటి?" అంటూ.

"అలగావాళ్ళ సహవాసం చేస్తే అలగా బుద్ధులు రాక మరేమి వస్తాయి" అంటూ సుదర్శన్‌ని ఓ చూపు చూసి, కొడుకును బరబరా లాక్కుంటూ వెళ్లింది.

"ముందు నీకు బుద్ధి ఉంటే... నీ పిల్లలకు వస్తుంది మంచి బుద్ధి. వాణ్ణి ఆడిపోసుకుంటావెందుకు" సుదర్శన్ బెల్ట్ అక్కడ పారేసి కోపంగా వెళ్ళిపోయాడు.

శివాజీ రాతిబొమ్మలా నిలబడిపోయాడు.

❍ ❍ ❍

మరోసారి వినీత బాల్‌తో ఆడుతూ టీపాయ్ మీద ఉన్న అందమైన ఫ్లవర్‌వాజ్‌ను బద్దలు కొట్టింది. అది విదేశీ వస్తువు. చాలా ఖరీదైనది. సుదర్శన్ ఫ్రెండ్ కానుకగా ఇచ్చినది.

శివాజీనే పగలకొట్టాడని సుదర్శన్‌కు చెప్పారు

ముగ్గురూ. సుదర్శన్‌కు జరిగింది అర్థమయింది. శివాజీని ఏమీ అనలేదు.

"చూశారా... వాణ్ణయితే ఒక్క మాట కూడా అనలేదు. అదే మన పిల్లలనయితే వీపు బద్దలు కొట్టేవారు. మీకు నాకంటే, నా పిల్లల కంటే ఆ దిక్కులేని వెధవ అంటేనే ఇష్టం" అన్నది కుసుమ.

"నువ్వంతే... నీ పిల్లలు ఇంతే..." విసురుగా వెళ్ళిపోయాడు సుదర్శన్.

❍ ❍ ❍

శివాజీ చదువు పూర్తిచేశాడు. సి.బి.ఐ.లో చేరాడు. జాబ్‌లో కూడా మంచి పేరు తెచ్చుకుంటున్నాడు. ప్రమోద్, వినీతలు కూడా బాగానే చదివారు. కానీ బుద్ధులు మాత్రం మారలేదు. వినీతకు పెళ్ళి సంబంధాలు చూస్తుండగానే క్లాస్‌మేట్‌తో వెళ్ళిపోయింది.

❍ ❍ ❍

దేశ రహస్యాలు విదేశీయులకు అమ్ముకుంటున్న ముఠా ఒకటి ఒకచోట సమావేశమయినట్లు ఇన్ఫర్మేషన్ వచ్చింది శివాజీకి. హుటాహుటిన బయలుదేరాడు. వాళ్ళు ఎలా పసికట్టారో ఏమో అందరూ పారిపోయారు. ఒక్కడు మాత్రం శివాజీ చేతికి చిక్కాడు. వాడు ప్రమోద్.

"నువ్వా ప్రమోద్... ఇంత నీచానికి దిగజారేవా?" అడిగాడు శివాజీ.

"ఏం తప్పేముంది? మన రాజకీయ నాయకులు, పెద్ద పెద్ద అధికారులు స్కాముల రూపంలో వేల వేల కోట్లు మింగి, ఈ దేశాన్ని ఎటూ నామరూపాలు లేకుండా చేస్తున్నారు. ఇంకా ఈ దేశంలో ఏం మిగిలిందని? నువ్వు కష్టపడి పదేళ్ళు ఉద్యోగం చేసి సంపాదించే సొమ్ముని నేను గంటలో సంపాదిస్తాను. నీకూ కావాలంటే వాటా ఇస్తాను. నన్ను వదిలెయ్" తల ఎగరేస్తూ పొగరుగా అన్నాడు ప్రమోద్.

"ఇంత దారుణమయిన అభిప్రాయాలు ఉన్న నిన్ను వదలడమా? అది కలలో కూడా జరగని పని" తన పట్టు మరింత బిగిస్తూ "నువ్వు మర్యాదగా లొంగిపోతే నీకు శిక్ష పెద్దగా పడకుండా చూస్తాను" అన్నాడు శివాజీ.

"నువ్వెంత చెప్పినా పట్టుబడితే నాకు శిక్ష బాగానే వేస్తారు. అనాథవైన నిన్ను చేరదీసి, కన్న కొడుకులాగా పెంచినందుకు మా నాన్నకు నువ్విచ్చే బహుమతి ఇదేనా?" అంటూ పారిపోవడానికి పెనుగులాడేడు ప్రమోద్. శివాజీ ఎంతకీ పట్టు వదలక పోవడంతో, జేబులోని కత్తి తీసి శివాజీ భుజంలో పొడిచి పరుగెత్తసాగాడు.

తప్పనిసరి పరిస్థితిలో ప్రమోద్ కాలిమీదకు శివాజీ పేల్చిన తుపాకీ గుండు గురితప్పి ప్రమోద్ వెన్నులో దిగింది. అతడు అక్కడికక్కడే నేలకూలాడు.

ప్రమోద్‌ను క్షణాల మీద ఆస్పత్రికి చేర్చినా ఫలితం లేకపోయింది. సుదర్శన్‌కు తన ముఖమెలా చూపించాలో శివాజీకి అర్థం కాలేదు. "అంకుల్... నన్ను మీరు క్షమించలేరు. నాకు తెలుసు. అయినా క్షమించమని అడిగే అర్హత కూడా నాకు లేదు. నేను ఘోర అపరాధం చేశాను. ఆంటీ ముందుకు నేనెలా వెళ్ళను? నాకు నిష్కృతి లేదు..." శివాజీ పొరలి పొరలి ఏడుస్తున్నాడు.

"నువ్వేమీ తప్పుచెయ్యలేదు. మీ ఆంటీ స్వయంకృతాపరాధమే ఇదంతా... బయటి శత్రువుల కంటే అంతశ్శత్రువులు మరింత ప్రమాదకరం. నీ స్థానంలో నేనున్నా ఖచ్చితంగా అలాగే చేసేవాడిని."

"ఒక చీడపురుగుని తుదముట్టించానని గర్వపడు. దేశమాతకు నీ వంతు సేవ చేసినందుకు పొంగిపోక, అలా క్రుంగిపోతావెందుకు? నిజమే... ఎంతయినా వాడు నా కన్న బిడ్డ. వాడి మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. మొదటినుండీ వాడు నాకు నిరాశను మిగిలిస్తూనే వచ్చాడు. కాలికో, చేతికో క్యాన్సర్ వచ్చిందనుకో... మన శరీరంలో భాగమని దాన్ని ఉంచుకోముగదా..., శస్త్ర చికిత్స ద్వారా దాన్ని తొలగించుకుని శరీరాన్ని కాపాడుకుంటాం. ఇప్పుడు నువ్వు చేసిన పనీ అలాంటిదే."

"ఒక బిడ్డ పోయినా..., కాదు కాదు... ఇద్దరూ పోయారు. అయినా, నా స్నేహితుడు నాకు ఇచ్చిన ఆణిముత్యం మిగిలింది. నిన్ను పెంచినవాడిగా నేను కీర్తి పొందుతాను. వాడిని తలచుకుని మరెప్పుడూ దుఃఖించకు. నీ మీద నాకు అభిమానం ఉన్నా మిత్రుడి కొడుకుగానే భావించాను ఇన్నాళ్ళూ... కానీ ఈవేళ నుంచీ నువ్వే నా బిడ్డవి.. రా.. నా దగ్గరకు. ఎప్పుడూ నాకు దూరం కాకు" అమితంగా ఏడుస్తున్న శివాజీని ఆర్తిగా కౌగలించుకున్నాడు సుదర్శన్.

"యుద్ధంలో గెలిచినా, నా భార్య బిడ్డలను తలుచుకుని జీవితంలో ఓడిపోయాననుకున్నాను. లేదు... లేదు... నేను జీవితంలో కూడా గెలిచాను... నిన్ను పెంచి నిజంగా గెలిచాను" అనుకున్నాడు మనసులో. ■